క్లుప్తంగా

విడవలూరు ఎస్సైగా రాజా



విడవలూరు: మండల నూతన ఎస్సైగా ఎం.రాజా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. పల్నాడు జిల్లా నర్సారావుపేట నుంచి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఆంజనేయులు ఆ జిల్లాకు బదిలీ అయ్యారు.

వరి పైరు పరిశీలన



పొదలకూరు: మండలంలోని మరుపూరు, తోడేరు గ్రామాల్లో వరిపైరును ఏఓ యు.గీతాకుమారి మంగళవారం పరిశీలించారు. రైతులు తగిన మోతాదులో ఎరువులను వాడాలని ఆమె సూచించారు. వరిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు నివారణ చర్యలను వివరించారు. మండలంలో 7,877 ఎకరాల్లో వరిసాగవుతోందని పిలక, చిరుపొట్ట దశలో పైర్లు ఉన్నట్లు చెప్పారు.

పేకాట స్థావరాలపై దాడి

కోవూరు: మండలంలోని ఇనమడుగు గ్రామ సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్ గౌడ్ పర్యవేక్షణలో సిబ్బంది దాడి చేశారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.7,680 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ సునీల్, హోంగార్డ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

యువకులపై దాడి

- ముగ్గురికి గాయాలు

మనుబోలు: పాతకక్షల నేపథ్యంలో మడమనూరు గ్రామానికి చెందిన ఓ యువకుడిపై దాడి జరిగింది. అతడితోపాటు అడ్డుకున్న మరో ఇద్దరికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల, పోలీసుల కథనం మేరకు.. గతంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మడమనూరు బీసీ కాలనీకి చెందిన అబ్దుల్లాకు నెల్లూరు వెంకటేశ్వరపురానికి చెందిన వారితో గొడవ జరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని సోమవారం రాత్రి ఆ ప్రాంతానికి చెందిన యువకులు ఇనుప రాడ్లు, కర్రలతో ఆటోలో వచ్చి అబ్దుల్లాపై దాడి చేస్తుండగా అదే కాలనీలో ఉంటున్న శివ, చందు, మరికొందరు అడ్డుకునే యత్నం చేశారు. ఈ క్రమంలో అబ్దుల్లాతో పాటు చందు, శివకు కూడా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం

కోవూరు: పట్టణంలోని వేమారెడ్డి జానకి రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నేత శైలేంద్ర రెడ్డి మంగళవారం తెల్లవారుజామున చనిపోయారు. ఈయన మృతిపట్ల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

కోవూరు: మండల కేంద్రంలోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, ఒకేషనల్ శిక్షకుడు నరేష్ మాట్లాడారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

పొదలకూరు: పట్టణంలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆ సమయంలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతి నగర్ వీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ చేశారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నెల్లూరు సిటీ: గర్భిణులకు సరైన సమయంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం ద్వారా మాతృ మరణాలను నివారించొచ్చని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎండీఆర్ అండ్ సీడీఆర్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లాలో ఇటీవల సంభవించిన ఒక మాతృ మరణం.. ఆరు శిశు మరణాలపై చర్చించారు. సమావేశంలో డాక్టర్ గీతాలక్ష్మి, గైనకాలజిస్ట్ రామచంద్రరావు, జనరల్ ఫిజీషియన్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి



హాజరైన పొదుపు మహిళలు తదితరులు

జగనన్న పాలనలో మహిళలకు అగ్రతాంబూలం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: సంక్షేమ పథకాలు, పదవుల్లో మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రతాంబూలం ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మనుబోలు సచివాలయం–2 ఆవరణలో మంగళవారం జరిగిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అవినీతి, వివక్షకు తావు లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సంక్షేమ పథకాల సొమ్ము జమ చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా నేరుగా ప్రజల వద్దకే వెళ్లి వారి అవసరాలను గుర్తించి పథకాలను అందజేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు.

రూ.122.37 కోట్ల జమ

ఆసరా పథకం కింద సర్వేపల్లి నియోజకవర్గంలో 4,063 గ్రూపులకు రూ.122.37 కోట్లను జమ చేశామని కాకాణి వెల్లడించారు. అలాగే అభివృద్ధికి కూడా అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. సచివాలయాల పరిధిలో ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌లకు కొత్త భవనాలను నిర్మించామన్నారు. గ్రామాల్లో మట్టి రోడ్డు అనేది లేకుండా సీసీ రోడ్లు, సైడు డ్రెయిన్లు నిర్మించామని తెలిపారు. తనను రెండుసార్లు గెలిపించిన సర్వేపల్లి ప్రజలకు ఇంటి బిడ్డలా సేవలందిస్తున్నట్లు చెప్పారు. పూటకోమాట మాట్లాడే చంద్రబాబును నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు హరగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆదినారాయణ, భాస్కర్‌గౌడ్, సాయిమోహన్‌రెడ్డి, రవీంధర్‌రెడ్డి, మహేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన నాయకులు

పొదలకూరు: స్థానిక శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం చినబ్రహ్మయ్య మాట్లాడుతూ దేవస్థానం వద్ద మిగిలిపోయిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కోరిన వెంటనే మంజూరు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, నాయకులు సోమా భాస్కర్, ఎం.శివశంకర్, శ్రీనివాసులుగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం



మాట్లాడుతున్న చలపతిరావు, నాయకులు

- డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం టపాతోపు అండర్ బ్రిడ్జి వద్ద బుధవారం జరిగే ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ వేదిక ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేందుకు మహిళలు సిద్ధం ఉన్నారన్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఆసరా పథకం ద్వారా అక్కచెల్లెమ్మలను ఆదుకున్నారన్నారు. ఆసరా సంబరాలకు మహిళలు పెద్దఎత్తున తరలి వస్తున్నారంటే జగన్‌పై ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పేదలు వృద్ధి చెందడమే లక్ష్యంగా సీఎం ముందుకు సాగుతున్నారని చెప్పారు. చేయూత, జగనన్న తోడు పథకాల ద్వారా నిరుపేదలకు అండగా నిలవడంతోపాటు వారికి విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. నేడు జరిగే ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వస్తారని తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా పాల్గొంటారన్నారు. మండలంలోని పొదుపు మహిళలు తరలి రానున్నారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయ మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి సీనియర్ నేత అడపాల మోహనకృష్ణ, నాయకులు కాకి సుమన్, ఇసనాక సునీల్‌రెడ్డి, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, పానేటి శీనయ్య పాల్గొన్నారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న కంపెనీ ప్రతినిధులు

తోటపల్లిగూడూరు: మండలంలోని అనంతపురంలో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సెంబ్‌కార్ప్)కు ప్రతిష్టాత్మకమైన 5ఎస్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఇటీవల నాగపూర్‌లో జరిగిన 37వ జాతీయ సదస్సులో క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ఈ అవార్డును అందజేసింది. కంపెనీ తరఫున హెచ్ఎస్ఈ టీమ్ అందుకుంది. ఆ కంపెనీ సీఈఓ శ్రీరాఘవ్ త్రివేది హెచ్ఎస్ఈ టీమ్‌ను మంగళవారం అభినందించారు.

రేపు వైఎస్సార్ ఆసరా సంబరాలు

విడవలూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం వైఎస్సార్ ఆసరా సంబరాలు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. పొదుపు సంఘాల మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

మనుబోలు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఎంఈఓ శేషాద్రివాసు ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెసన్ ప్లాన్ తప్పనిసరిగా పాటిస్తూ సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో నాడు – నేడులో భాగంగా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రమేష్‌కుమార్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఆదిశేషయ్య, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

వచ్చే నెల 13 వరకు 'స్పర్శ'



ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ కార్యక్రమాలు జరుగుతాయని వైద్యాధికారులు డాక్టర్ విజయ్ శంకర్, డాక్టర్ శ్రావణి తెలిపారు. మండలంలోని గంగపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం కుష్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీపీఎంఓ వెంకటేశ్వర్లు, వైద్యారోగ్య సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జగదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో స్పర్శ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ సుధాకర్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమ, సీహెచ్‌ఓ కమల, హెల్త్ అసిస్టెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్

కొడవలూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు ఏఎస్సై గంధం ప్రసాద్ తెలిపారు. నార్తురాజుపాళేనికి చెందిన షేక్ ముజాఉద్దీన్ (34), యల్లాయపాళేనికి చెందిన షేక్ జాఫర్ (65) ఆదివారం రాత్రి మోటార్‌బైక్‌పై వెళ్తూ టపాతోపు వద్ద అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లడం, బైక్ నడుపుతున్న ముజా ఉద్దీన్ ఆస్పత్రి తరలించేలోపే మృతిచెందగా జాఫర్‌ను నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. జాఫర్ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన మంగళవారం తెలిపారు.

క్రీడాకారులకు వసతి ఏర్పాట్ల పరిశీలన



నెల్లూరు(బారకాసు): ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలకు విచ్చేసే క్రీడాకారుల వసతి ఏర్పాట్లను కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం పరిశీలించారు. ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదాన సమీపంలోని ప్రైవేట్ హోటళ్లలో క్రీడాకారులకు వసతిని కల్పించారు. వీటిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో టోర్నీని జయప్రదం చేయాలని సూచించారు. టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటర్ ప్రాక్టికల్స్



మాట్లాడుతున్న ఆర్ఐఓ

- ఆర్ఐఓ శ్రీనివాసులు

పొదలకూరు: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌ను పక్కాగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆర్ఐఓ ఆదురు శ్రీనివాసులు కోరారు. స్థానిక ప్రభుత్వం జూనియర్ కాలేజీలో మంగళవారం ఆర్ఐఓ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రాక్టికల్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపల్స్ నుంచి విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిస్ నెల్లూరు విజేతలకు అభినందన



నెల్లూరు(బృందావనం): మిస్ నెల్లూరు – 2024 పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అభినందన సభను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడారు. మిస్ నెల్లూరు శ్రియ, రన్నర్స్ బాషిత, గాయత్రిని సత్కరించారు. అనంతరం మిస్ నెల్లూరు – 2023 విజేతలు తనూష, లతీఫాను సన్మానించారు. కళా సంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, భాస్కర్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, డ్యాన్స్ మాస్టర్ నటరాజ్, షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజ ఆరాధనోత్సవం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో త్యాగరాజ ఆరాధన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పంచామృతాభిషేకం, నామార్చన అనంతరం భక్త బృంద ఆధ్వర్యంలో భిక్షాటనతో నగర సంకీర్తన, త్యాగరాజకృతుల గానం, పల్లకి సేవను వేడుకగా జరిపారు. స్థానిక సంగీత విద్వాంసులతో పంచరత్న గోష్ఠి గానాన్ని వీనులవిందుగా నిర్వహించారు. విశేష పుష్పాలంకారంలో త్యాగరాజస్వామి దర్శనమిచ్చారు. మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపారు. త్యాగరాజ సేవా సమితి నిర్వాహకుడు యనమండ్ర నాగదేవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి



వెంకటాచలం: వీఎస్‌యూలో..



ఇందుకూరుపేట: గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత విగ్రహానికి వీసీ జీఎం సుందరవల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అహింసను ఆయుధంగా చేసుకుని దేశానికి స్వేచ్ఛ అందించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ఆయన్ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, సుజా ఎస్ నాయర్, హనుమారెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని స్థానిక బిట్–1 సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు ఘన నివాళులర్పించారు. జిల్లా లెప్రసీ నోడల్ అధికారి డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడారు. గాంధీ వర్ధంతిని పురస్కరించి 15 రోజులపాటు స్పర్శ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి నివారణ, గుర్తింపుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వైద్యాధికారులు రిషిత, కావ్య, వార్డు సభ్యులు జయమూర్తిరెడ్డి, మూలి సతీష్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఎం.రవివకుమార్, బొల్లినేని భారతమ్మ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం కన్వీనర్ గణేశం కల్పనమ్మ ఆధ్వర్యంలో మంగళవారం జాతిపిత వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా ట్రెజరర్ సురేష్‌కుమార్ జైన్ మాట్లాడుతూ మహాత్ముడు స్వహస్తాలతో ప్రారంభించిన పల్లిపాడు ఆశ్రమం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన హెచ్‌వీఎస్‌కే రంగరావు మాట్లాడుతూ అహింస, సత్యం అనే ఆయుధాలతో మహాత్ముడు ప్రపంచానికి కొత్తదారి చూపించారని కొనియాడారు. కమిటీ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆశ్రమ నిర్వహణ గురించి తెలియజేశారు. స్థానికులు దువ్వూరు పాపిరెడ్డి గోశాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. రామచంద్రారెడ్డి హాస్పిటల్ వైద్యురాలు పద్మ గోదానం చేశారు. అలాగే స్థానికులు నెల్లూరు శ్రీనివాసులురెడ్డి గ్రంథాలయం ఏర్పాటు చేసి ప్రారంభించారు. తొలుత అతిథులు గాంధీజీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్వోదయ విశ్రాంత ప్రిన్సిపల్ కాళిదాసు పురుషోత్తం, రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ ఎంవీ సుబ్బారెడ్డి, గుణపాటి ప్రసాద్‌రెడ్డి, ఎడవల్లి సురేష్, దాసరి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరులో..

రహదారి భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నెల్లూరు(టౌన్): వాహనాన్ని నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఏఎంవీఐ పూర్ణచంద్ర అన్నారు. రహదారి భద్రతపై స్కూల్ బస్సుల డ్రైవర్లు, అటెండర్లకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా రవాణా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ అంశాలను తెలియజేశారు. నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఏఎంవీఐలు స్వప్నిల్‌కుమార్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా నేడు

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను కెరీర్ స్కూల్ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైసా బజార్, టెలి పర్ఫార్మెన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఒమేగా హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి చెన్నై, కోయంబత్తూర్, బెంగళూరు, హైదరాబాద్, పుణె, ముంబైలో పనిచేసేందుకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని వివరించారు. ఐటీకి సంబంధించి ఏదైనా డిగ్రీ (సాఫ్ట్‌వేర్ డెవలపర్, టెక్నికల్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్), నాన్ ఐటీ (బ్యాంకింగ్, ఇన్సురెన్స్, ఈ – కామర్స్, హెల్త్ కేర్, టెలికామ్, సేల్స్, మార్కెటింగ్, ఫైనాన్స్, అకౌంట్స్) ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయానికి ఉదయం 10.30కు హాజరుకావాలని కోరారు.

10న మాదిగల యుద్ధభేరి మహాసభ

నెల్లూరు(వేదాయపాళెం): మాదిగల యుద్ధభేరి మహాసభను నగరంలోని నర్తకి సెంటర్‌లో ఫిబ్రవరి పదిన నిర్వహించనున్నామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య మాదిగ తెలిపారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పలు ప్రజాసంఘాలు, మాదిగ ఉద్యోగ సంఘాల నేతలు హాజరై మహాసభకు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగల హక్కులు.. రాజకీయ ప్రాధాన్యం కోసం మాదిగల యుద్ధభేరి సభను నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆలిండియా ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరం అధ్యక్షుడు రవి రాఘవేంద్ర, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర, మాతంగి కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.